

# భవానీద్వీపం

## – వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

### - 34 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

సైనికులు అందరూ తమ గుఱ్ఱాలను కొండపాదంలో ఉన్న చెట్లకింద విడిచారు. కృష్ణమ్మ అలలలో వూయలలూగుతున్న పడవలవద్దకు దారి తీశారు యిద్దరు మొఘలు సైనికులు. వారిని అనుసరించారు యిద్దరు గోల్కొండ సైనికులు. బాలకృష్ణస్వామి ముందు నడుస్తుండగా నదిని చేరుకున్నారు సమర్ధుడు, కృష్ణరాయలు. తలలూపుతున్న కొండపల్లి బొమ్మల్లా నాట్యంచేస్తున్నాయి రెండు పడవలు. నదిలో పాదం మోపకముందే వంగి కృష్ణమ్మ నీటిని నెత్తిన చల్లుకున్నాడు సమర్ధుడు. కృష్ణరాయల తలపై, బాలకృష్ణస్వామి తలపై చల్లాడు. చేతులు జోడించి నదికి నమస్కరించాడు. ఒకపడవలో సమర్ధుడు, కృష్ణరాయలు, బాలకృష్ణస్వామి కూర్చున్నారు. మిగిలినవారు రెండవదానిలో కూర్చున్నారు. రెండవ పడవలో యేవో వస్తువులు చిన్న గుట్టలా పేర్చబడ్డాయి. పైన మందపాటి కంబళ్ళు దట్టంగా కప్పి వున్నాయి. పడవలు నెమ్మదిగా కదిలాయి భవానీద్వీపం వైపు.

★★★★★★★★★★★★★★★★★★★

పాఠకుడా!

ఇక తెర తొలిగిస్తాను. అనంతకాలంగా అన్నీచూస్తున్న దాని నేను. నీ ముత్తాతల తాతలను చూసినదానిని నేను. మహాగణపతికి మ్రొక్కిన దానిని నేను. కాశీవిశ్వేశ్వరుని మరులకు జిక్కి మత్తెక్కించుకున్నదానిని నేను. దత్తాత్రేయుని దయను దక్కించుకున్న దానిని నేను. బసవని భవ్యమైన పలుకులతో సంగమించిన దానిని. మల్లన్నకు మోకరిల్లినదానిని. నరసింహునికి నతులుజేశాను. శాక్యముని స్మృతుల గంగలో తడిశాను. కాలచక్ర వైభవాల సుడులు తిరిగాను. శాతవాహన శౌర్య ధారలనూ చవిజూశాను. దుర్గమ్మ పాదాలను స్పృశించాను. పరమహంసల పరిష్వంగములో పరవశించాను.

అగాధమైన గాథ నాది. అనన్య సామాన్యమైన వీథి నాది. పుణ్యపురుషుల వినోదాల పునాది నాది. ఎందరిని చూశాను! ఎన్ని చూశాను! ఎందరికోసం ఎదురు చూశాను! ఎన్ని దుఃఖాశ్రువులు మోశాను? ఎన్ని మధుర గీతికలు మ్రోశాను? ఇప్పటిదా? నా వీక్షణ, నిరీక్షణ, పరీక్షణ, ఎన్ని యుగాలది! ఇంకెన్ని యుగాలు చూస్తాను! ఇవన్నీ నాకు లిప్త మాత్రములు! నేనేవరికోసమూ ఆగలేదు, ఆగను. సాగిపోతూనే ఉంటాను. మధ్యమధ్యలో పలుకరిస్తాను, ఆగ్రహిస్తాను. బ్రతికిస్తాను, బ్రతుకులను బండలూ చేస్తాను.

పాఠకుడా! నేను కృష్ణను. నేను గంగను, పాతాళగంగను!

కల్లలు కాదు, కమనీయమైన యదార్థ గాథలు చెబుతున్నాను. నేను నేపథ్యములో వుంటూ కొన్ని సత్యములను చెబుతున్నాను. కొన్ని మిథ్యలను తేట తెల్లములు చేస్తున్నాను. రహస్యాలను దాచి దాచి నా గుండె బరువెక్కింది, దానిని తేలిక పరుచుకుంటాను! ఒళ్లంతా చెవులు చేసుకో. చెవులలో కాల రహస్య సారమంతా నూరిపోస్తాను. విని విషయాన్ని గ్రహిస్తావో, విజ్ఞతతో చరిస్తావో, నీ ఇష్టము. కల్లలను నిజాలుగా భ్రమిస్తావో, విశృంఖలంగా పరిభ్రమిస్తావో, నీ స్వేచ్ఛ!

మరలా చెబుతున్నా, నన్ను తెలుసుకో, నిన్ను తెలుసుకో, మనంతటి వాళ్ళు లేరని తెలుసుకో. తెలుసుకుంటావా? నాతో రా! భయపడకు. మరలా నిన్ను యిక్కడికే తెచ్చి దింపుతా. కాల రహస్య మధువు నీకై అంతా ఒంపుతా. భావి పాత్రలో అనన్య సత్యాల అమృతం నింపుతా, తాగి అమరుడివి అవుతావో, వద్దని జీవన్మృతుడివి అవుతావో, నీ ప్రాప్తం! సరే! ఇక్కడే కాలాయాపనమెందుకు, వెళ్దాం రా! భవానీద్వీపం పిలుస్తున్నది. వెళ్దాం! ఇంతవరకు ఎవరూ చెప్పని కథలు యిప్పుడు చెప్పబోతున్నాను! జరిగిన కథలు! జరుగబోయే కథలు! సత్యమైన కథలు చెప్పబోతున్నాను!

★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★

ద్వీపం ఈశాన్యపు అంచును కోస్తూ కాలువలా చేసిన నీటిలో పడవలను ఆపారు. జై భవానీ! అని నినదిస్తూ సమర్థుడు ముందుగా పాదం మోపాడు భవానీ ద్వీపం మీద. వెనుకగా మిగిలినవారందరూ పడవలలోంచి దిగారు. రెండవ పడవలో కంబళ్ల కిందనుండి విశాలమైన పేటికను, యేవో పరికరాలున్న పెద్ద మూటను ఒడ్డుకు దింపారు. నలుగురు సైనికులు, పడవలు నడిపిన వాళ్ళిద్దరు కలిసి ప్రయాసతో ఒడ్డుకు చేర్చారు ఆ పేటికను. వందసంవత్సరాల వయసున్న పొగడ చెట్టు మొదలుతో చేసిన పేటిక అది. కరిగించిన పంచలోహాలతో మరలు, మూడు గడియలు బిగించారు దానికి. చక్రాల ఆకారంలో వున్న మూడు గడియలను ఒక క్రమ పద్ధతిలో తిప్పితే తప్ప ఆ పేటిక తెరుచుకోదు. రెండుపక్కలా మూడేసి, మొత్తం ఆరు చక్రాలున్నాయి ఆ పేటికను లాగుకొని వెళ్ళడానికి వీలుగా.

యిప్పుడిప్పుడే వెలుగులు మందగిస్తున్నాయి. చీకట్లు ముసురుకోడానికి త్వరపడుతున్నాయి. వారి పద్ధతిలో నమస్కరించి సెలవు తీసుకున్నారు సైనికులు. పడవలలో ఎక్కి కూర్చున్నారు. పడవలు కాలువనుండి వెనక్కు తిరిగి నదిలో నెమ్మదిగా కదిలి కనుమరుగైనాయి. బాలకృష్ణస్వామి, బందరునుండి వచ్చిన యిద్దరు సన్యాసులు చేతులు కట్టుకుని చూస్తున్నారు సమర్థుని ఆదేశం కోసం. ద్వీపాన్ని కనబడిన మేరా పరిశీలనగా చూస్తున్నాడు ఆయన.

చివరలు కనబడకుండా ఆకాశానికి ఎదిగిన మహావృక్షాలు, చీకట్లలా చిక్కగా అల్లుకున్న పొదలు గంభీరంగా వున్నాయి. ద్వీపానికి అటుచివర పెద్ద కొండ శిఖరం మసక మసకగా కనిపిస్తున్నది. చీకట్లు పూర్తిగా కమ్ముకోకముందే గూళ్లకు చేరుకోవాలనే పక్షుల గుంపులు సైనికుల్లా బృందాలుగా

చేరుకుంటున్నాయి. చెట్ల మీదకు చేరుకున్న పక్షుల కోలాహలం వాటికి స్వాగతం పలుకుతున్నట్లు వున్నది. ముందు దీర్ఘంగా, తర్వాత ఆగి ఆగి వరుసలుగా గంభీరంగా వినిపించాయి, సింహ గర్జనలు. బందరు స్వాముల అంగరఖాల చాటునుండి ప్రత్యక్షమయ్యాయి మూడేసి అడుగుల పొడవున్న కత్తులు. తానూ నడుముకున్న కత్తిమీద చేయి వేశాడు కృష్ణరాయలు.

' నాలుగుమైళ్ళ దూరంలో గర్జించింది, భవాని వాహనం భవానీ ద్వీపానికి స్వాగతం పలుకుతున్నది కృష్ణోబా ' అన్నాడు సమర్థుడు వినోదంగా. కృష్ణరాయలు ఏదో అనబోయేంతలో పొదలు విసురుగా కదిలాయి. వేగంగా పరుగులు పెడుతూ వచ్చి దూకాయి రెండు నక్కలు. ఎవరో తరుముతున్నట్లుగా వచ్చి, వీరిని చూసి భయంతో పక్కకు దూకి పొదలమధ్యన మాయమైనాయి, సన్నగా అరుస్తూ. కొన్ని నిముషాలకు తెలిసింది వాటి పరుగులకు కారణం. పొదలను పొడవాటి బరిశెలతో తొలిగిస్తూ ప్రత్యక్షమయ్యారు ఉద్ధవుడు, కళ్యాణస్వామి! అనుకోకుండా జరిగిన సంఘటనకు ఉలిక్కిపడ్డ బందరు స్వాములు చిరునవ్వులు చిందించారు వారిని చూసి. కృష్ణరాయలకు మాత్రం ఆశ్చర్యం కలిగింది. ఉద్ధవుడు, కళ్యాణస్వామి అక్కడకు వచ్చే సంగతి కృష్ణరాయలకు తప్ప మిగిలినవారికి అందరికీ తెలిసినట్లుగా వుంది.

గురుదేవుడికి నమస్కరించి పేటికను కదిలించారు ఉద్ధవుడు. మూటను భుజాలకెత్తుకున్నాడు ఒక బందరు స్వామి. బరిసెను పట్టుకుని, దారి చేస్తూ ముందుకు కదిలాడు కళ్యాణ్ స్వామి. అందరూ కదిలారు. అందరికీ వెనుకాల కత్తిని ఎత్తిపట్టుకుని పరిసరాలను గమనిస్తూ కదిలాడు మరొక బందరు స్వామి. చిరు చీకట్లమధ్య చిక్కని పొదలను చీల్చుకుంటూ ఘడియసేపు సాగింది నడక. పూర్తిగా చీకట్లు కమ్ముకునే సమయానికి తొలిగిన పొదల మధ్యన వింత దృశ్యం కనిపించింది కృష్ణరాయలకు.

పొదలు, మహావృక్షాలు లేని పచ్చికమైదానం లాంటి స్థలంలో విశాలంగా చదునైన స్థలం కాగడాల వెలుగులో కనిపించింది. అక్కడ పది ధనుస్సుల వైశాల్యంలో వృత్తాకారంలో నిలువెత్తునా దృఢమైన కంచె నిర్మింపబడి వుంది. బలమైన వెదురు గడలు, వెదురు తీగలతో గోడలా దృఢంగా వున్నది ఆ కంచె. సరిగా మధ్యలో మూడు ధనువుల వైశాల్యంలో మరొక కంచె వృత్తాకారంలో వున్నది. వెదురు గుడిసెలా పైకప్పు వేసి వున్నది. కాగడాల వెలుగులో పగటిలా స్పష్టంగా కనిపిస్తున్నది అంతా.

వెదురు తడికతోనే చేసిన ద్వారాన్ని తెరుచుకుని లోపలి ప్రవేశించారు అందరూ. కృష్ణరాయలకు అంతా సంభ్రమంగా ఉన్నది యింకా. శిష్యులు అందరూ ఎంతో ముందుగా ఆదేశింపబడ్డట్లు ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటూ పోతున్నారు. రెండు అడుగుల ఎత్తున వెదురు గడలతో చేసిన ముక్కాలిపీటలాంటి ఆసనం మీద కూర్చుని మౌనంగా పర్యవేక్షణ చేస్తున్నాడు సమర్థుడు. మధ్యభాగంలో ఏడు వృత్తాలుగా ముగ్గు వేశాడు ఉద్ధవుడు. మధ్యలోని యేడవ వృత్తంలో విరిసిన పద్మం ఆకారంలో వేశాడు. ముగ్గువేస్తున్నంత సేపూ ఉద్ధవుడి పెదవులు కదులుతున్నాయి మంత్ర పఠనం చేస్తున్నట్లు. పెద్ద పెద్ద మట్టి బానలలో కృష్ణమ్మ నీళ్లు సిద్ధంగా వున్నాయి. అందరూ స్నానాలు ముగించారు. సమర్థుడి పూజాపేటిక సిద్ధంగా వుంది. రఘువీరుడికి కొలుపు ముగిసింది. అందరూ ఫలాలను ఆహారంగా తీసుకున్నారు కృష్ణరాయలు తప్ప. ఆ రాత్రికి మంచినీరు మాత్రమే తీసుకోవాలని రాయలకు ఆదేశించాడు సమర్థుడు. సమర్థుడి ఆదేశం మేరకు కృష్ణరాయలు తప్ప మిగిలినవారందరూ అక్కడినుండి నిష్క్రమించారు.

"కృష్ణోబా!" అన్న పిలుపుతో తన ఆలోచనలనుండి బయటపడి తలెత్తి చూశాడు రాయలు. పద్మాసనంలో అర్థనిమీలిత నేత్రాలలో రాయలను చూస్తున్నాడు సమర్థుడు. కనులలోకి చొరబడి, గుండెల లోతుల్లోకి దిగబడి శోధిస్తున్నవాడిలా చూస్తున్నాడు. ' ప్రతిదానికీ ఒక మూలం వున్నది కృష్ణోబా! తెలుసుకోగలగాలి, అంతే ' అన్నాడు.

కొద్దిసేపు మౌనం తర్వాత మరలా కొనసాగించాడు. ' నేటికీ, నిన్నటికీ, రేపటికి సంబంధం వున్నది. అది శరీరానికి సంబంధించి కాదు. ఈ శరీరం ఇవ్వాళా ఉన్నది అంటే నిన్న కూడా వున్నది కదా. రేపు యిది ఉండక పోవచ్చు. కానీ ఆత్మ వుంటుంది. నిన్న, ఈరోజు ఆత్మ వున్నది. రేపూ, సంవత్సరాల తరబడి, యుగాల పర్యంతం వుంటుంది. అనంతాత్మలో లీనమయ్యేదాకా జీవాత్మగా వుంటుంది. మరలా మొదలు' అన్నాడు.

' అనంతాత్మను చూడగలిగితే అందులో అంతర్భాగమైన జీవాత్మను చూడవచ్చు. ఆ జీవాత్మ అనుభవాలను చూడవచ్చు.ఆ అనుభవాలే వివిధ జన్మలు. వివిధ జన్మల కర్మల ఫలం అంతమయ్యేదాకా జీవుడి ప్రయాణం అది. వివిధ జన్మలు ఆ ప్రయాణంలో మజిలీలు. ఒక దీర్ఘ ప్రయాణం ముగించిన తర్వాత, ప్రయాణంలో మజిలీలను అనుభవాలను గుర్తుచేసుకోవడం లాంటిది అది. అదే దివ్యదృష్టి ', అరమోడ్పు కన్నులతో చూస్తూ చెబుతున్నాడు సమర్థుడు.

' భయంకరమైన కాలసర్పం నిన్ను అంతం చేయటానికి ప్రయత్నించింది. దానికి ఒక కారణం వున్నది కృష్ణోబా! దివ్యమైన శ్వేతనాగు దానిని అడ్డుకుని, నిన్ను కాపాడడానికి కూడా కారణం వున్నది. ఈ కథ యిప్పటిది కాదు. యిప్పుడు ముగిసేదీ కాదు. అంతా చూద్దువుగాని ' అన్నాడు. ఆశ్చర్యంతో వింటున్నాడు కృష్ణరాయలు. ' రేపటి రోజు నీదొక దివ్యదృష్టి. నువ్వొక అపూర్వ ద్రష్టవు. ఈ క్షణం నుండీ నీకు మౌనవ్రతం కృష్ణోబా! ఏ ఆలోచనలు లేకుండా నీ ఉఛ్వాస నిశ్వాసాల మీద దృష్టి పెట్టి ప్రశాంతంగా నిద్రించు' అని మౌనం వహించాడు సమర్థుడు. కృష్ణమ్మ, భవానీద్వీపం, ప్రకృతి అన్నీ శ్రద్ధగా వింటున్నట్లు మౌనం వహించాయి. అడవి సద్దుమణిగింది.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS